

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

MAY-2014

సంవత్సర చందా రూ. 50/-

## సంక్షిప్త వార్తలు

కృష్ణాజిల్లా, పరిటాల గ్రామంలో ఉన్న క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ఏప్రియల్ 9,10, 11వ తేదీలలో క్రీస్తు సువార్త మహాసభలు స్థానిక సువార్తికుడు సహో॥ మురుగుల రాజేంద్రకుమార్ అధ్యక్షతలో వారి ప్రారంభ ప్రార్ధనతో ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన మొదటి సువార్త సభలో ముఖ్య అతిధి, అంతర్జాతీయ సువార్తికులు బ్ర. రిక్కీగూటం గారు పాల్గొని, ఇదిగో యుగయుగములు సజీవుడనైయున్నాను (ప్రకటన 1:18) అను అంశముపై వాక్య పరిచర్యచేసిరి అల్ఫయు–మొదటివాడును, సృష్టి పూర్వము నుండి ఉన్నవాడు, ఒమెగయు – అంతములేనివాడని క్రీస్తు చుట్టూ కేంద్రీకృతమైయున్న లేఖనాలను వివరించి, బోధించి దేవుని మహిమపరచిరి. సహో॥ యన్.కె.వై. దాస్ (ఇబ్రహీంపట్నం) వారు ప్రసంగిస్తూ క్రీస్తులో పాపికి పాప క్షమాపణ కలదని అన్నారు. సహో॥ డి.యస్. నెల్సన్ (కిలేశపురం) వారి ప్రార్ధనతో మొదటిరోజు సభ ముగిసింది.

రెండవరోజు బుధవారం 10వ తేదీన జరిగిన సభలో సహో॥ యం. రవికుమార్ (ఫెర్రి), సహో॥కోట రవీంద్రనాధ్ (నందిగామ) వీరిరువురు ప్రసంగిస్తూ ఏసు జనసమూహములకు ఉపమానరీతిగా బోధించిన బోధనలను గూర్చి వివరించిరి. సహో॥ మురుగుల రాజేంద్రకుమార్ (పరిటాల) వారు ప్రసంగిస్తూ క్రీస్తు జననము, మరణము, సమాధి, పునరుత్థానము పై చక్కగా వాక్యమును బోధించిరి.

మూడవరోజు గురువారం 11వ తేదీన జరిగిన సభకు సహో॥ మురుగుల రాజేంద్రకుమార్ గారు అధ్యక్షత వహించిరి. సహో॥ యన్. బాబూరావు (పెద్దాపురం) ప్రారంభ ప్రార్ధన చేయగా సహో॥ డి. రత్నకిషోర్ (విజయవాడ), యు.ఇశ్రాయేల్ (బైబిల్ కళాశాల ప్రిన్సిపాల్–ఇంకొల్లు), యు. అశోక్ కుమార్ (రాచపూడి) బోధించిరి. సువార్తికులు సహో॥ బి. ఆనందరావు (ఖమ్మం), ఎ. ఆనందరావు (వినగడప), పి.వి.అప్పారావు (నందిగామ), యంరాజు (కొత్తపేట), మార్కనూడి రాజారావు (పొన్నవరం), తంగిరాల సామ్యూల్, రావూరి ఆదినారాయణ మరెందరో సువార్తికులు పాల్గొని దేవుని మహిమపరచిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | మే - 2014 | సంచిక - 10


## విశ్వాసమనగా ...
### (Faith is........)

క్రైస్తవునికి దేవునితో గల సమస్త సంబంధములకు విశ్వాసము ఆధారమై యున్నది. క్రైస్తవునికున్న నిరీక్షణకు విశ్వాసము ఆధారమైయున్నది. క్రైస్తవుని కున్న నిరీక్షణ యంతటికిని విశ్వాసము పునాదివంటిది. రక్షింపబడు వానిని రక్షకునితో కలుపునట్టిది విశ్వాసము. అయితే విశ్వాసము అను అంశమును అనేకులు అపార్థము చేసికొనుచున్నారు. విశ్వాసము యొక్క అర్థమును గూర్చియు, దానిని కార్యాచరణలో నుంచుటను గూర్చియు తెలిసుకొనుటకు మనము బైబిలు నుండి సహాయమును వెదుకుదము. అట్లు చేయకముందు విశ్వాసము ఏమైయుండ లేదో తెలిసికొనుట మనము సహాయకరముగా యుండునని నా యభిప్రాయము.

విశ్వాసము గ్రుడ్డిది కాదు. అనాలోచితమైనది కాదు. అనాలోచితముగాను, గ్రుడ్డితనముగాను అనేకులు అనుసరించు మతములు కలవు. అట్టివి మూఢనమ్మకములపై ఆధారపడి యున్నవి. అయితే లేఖనములు విశ్వాసమును గూర్చి చెప్పు సంగతి దానికి వేరుగ యున్నది.

"కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" అని బైబిలు బోధించుచున్నది. (రోమా 10:17). దేవుని నుండి వచ్చిన సాక్ష్యముపై విశ్వాసము ఆధారపడి యున్నది. మనము యేసునందు నమ్మునట్లు భక్తుడైన యోహాను తన సువార్తను వ్రాసెను (యోహాను 20:30,31). ఒక బోధకుడు లేఖనముల ప్రకారము బోధించుచున్నాడో లేదో వినుచున్న వారు లేఖనములను పరిశోధించి తెలిసికొన వలెనని దేవుడు కోరుచున్నారు. (అపో. కా. 17:11). అనాలోచిత మూఢత్వమునకు ఖచ్చితముగా వ్యతిరేకమైనది విశ్వాసము.

విశ్వాసము చిత్తవిభ్రమ సంబంధమైనది (Emotionalism) కాదు. ఆరాధనలో గంతులువేయుట, కేకలు వేయుట, బొబ్బలు పెట్టుచు చప్పట్లు కొట్టుట అనునవి చిత్తవిభ్రమ సంబంధమైనవి. అవి విజ్ఞానసంబంధమైనవి కావు. బైబిలు విశ్వాసము ఎల్లప్పుడు వాస్తవములపైనను, వాటి జ్ఞానముపైనను ఆధారపడి యున్నది. వివేక విశిష్టమైన (rational) మనస్సును, భావప్రేరిత హృదయమును అది ఆకర్షించును. అందుకే "నేను నమ్మిన వానిని ఎరుగుదును" అని అపో.పౌలు చెప్ప గలిగెను (2 తిమో 1:12). మరల గలతీయులకు వ్రాయుచు అతడు మీరు "ధర్మశాస్త్ర సంబంధక్రియల వలన ఆత్మను పొందితిరా వినుట వలన పొందితిరా? లేక విశ్వాసముతో వినుట వలన పొందితిరా?" యని అడిగెను (గలతీ 3:2). విశ్వాసము ఎల్లప్పుడు సాక్ష్యముపై ఆధారపడి యున్నది.

విశ్వాసము బుద్ధిహీనత కాదు. ఈ మధ్య కొందరు బోధకులు తమకున్న విశ్వాసమును నిరూపించుటకుగాను పాములను పట్టుకొనుట, విషమును మ్రింగుట చేసి చనిపోయినట్లు వార్తాపత్రికలలో చదివి యుంటిమి. బైబిలులో విశ్వాసము ఎన్నడు ఈరీతిగా చిత్రీకరింపబడలేదు. సరిగదా విశ్వాసులు ఆరోగ్యకరమైన బుద్ధి, ఆత్మనిగ్రహము కలిగిన వారని బైబిలు బోధించుచున్నది. యేసు దేవుని కుమారుడని నిరూపించుకొనుటకుగాను దేవాలయ శిఖరము నుండి అపవాది ఆయనను దుముకుమని ప్రోత్సహించినను దానికి ఆయన లోబడలేదు (మత్తయి 4:5-7).

నేను దేనినైనను సంపూర్ణముగ అర్థము చేసుకుంటేనే గాని దానిని నమ్మను అనునట్టిది విశ్వాసము కాదు. లేఖనములలో సమస్తమును మనముగ్రహించుకొనగలమని దేవుడు చెప్పలేదు గాని మనము ఆయన మాటను విశ్వసించవలెను. మనము వెలిచూపును బట్టి కాక విశ్వాసమును బట్టి నడుచుకొనవలెనని

ఆయన కోరుచున్నారు (2 కొరింథి 5:7). దేవుడేమైనను చెప్పిన యెడల విశ్వాసము దానిని గ్రహించినను గ్రహించకపోయినను దానిని నమ్మును.

విశ్వాసము ఏమైయుండలేదో ఇంతవరకు మనము చూచాము. ఇప్పుడు విశ్వాసమనగా యేమిటో పరిశీలింతము.

దేవుడు తనవాక్యమునందిచ్చిన సాక్ష్యమును నమ్ముట విశ్వాసము. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును". నీవు దేవుని వాక్యమును ఎంతవరకు చదివి గ్రహించుకొనగలవో అంతమట్టుకు నీ విశ్వాసముండునని ఈవాక్యమువలన మనము గ్రహించుకొనగలము.

సమస్త విషయములలోను దేవుని, ఆయన కుమారుని నమ్ముటయే విశ్వాసము. "అబ్రాహాము పిలువబడి నప్పుడు విశ్వాసమునుబట్టి ఆపిలుపు నకులోబడి, తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలు దేరి వెళ్లెను. మరియు ఎక్కడికి వెళ్ళ వలెనో అది ఎరుగక బయలు వెళ్లెను" (హెబ్రీ 11:8). మరణమునకైనను, జీవమునకైనను దేవుని యందు సంపూర్ణ నమ్మిక కలిగియుండుట విశ్వాసము.

దేవుని వాగ్దానములను లేక హెచ్చరికలను విశ్వసించి వాటి ప్రకారము చేయుట విశ్వాసము. శారా గొడ్రాలై 90 సంవత్సరముల వృద్ధురాలైనను తానొక కుమారుని కందునని విశ్వసించెను. ఆమె ఇస్సాకును కనెను (హెబ్రీ 11:11). అంతకు ముందెన్నడు వర్షము భూమిపై కురియకపోయినను, భూలోకమునంతటిని జలప్రళయము ద్వారా నాశనము చేసెదనని దేవుడు నోవహుతో చెప్పగా అతడు దానిని విశ్వసించి ఒక ఓడను తయారుచేసికొని తన కుటుంబమును రక్షించుకొనెను (హెబ్రీ 11:7).

దేవుడు చేయుమని చెప్పిన దానిని ఆయన చెప్పినట్లే చేయుట విశ్వాసము. ప్రేమ ద్వారా పనిచేయు విశ్వాసమును దేవుడు కోరుచున్నాడు (గలతీ 5:6). "విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటే శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను... అతడు ఆ విశ్వాసమును బట్టినీతిమంతు డని సాక్ష్యము పొందెను" (హెబ్రీ 11:4). దేవుని వాక్యమును వినుట వలన విశ్వాసము కలుగును గనుక జంతుబలిని అర్పించుమని దేవుడు చెప్పిన దానిని హేబెలు వినెను. కయీనయితే దేవుడు కోరినట్లుకాక తన యిష్టప్రకారము దేవునికి అర్పణలను తెచ్చెను. అతడు తిరస్కరించ బడెను. ఎందువలన? అతడు విశ్వాస మునుబట్టి నడుచుకొననందు వలన.

ఆరాధనలో గాని, పరిచర్యలోగాని, రక్షణమార్గములో గాని విశ్వాసము దేవుని మాటచొప్పున నడుచుకొనును.

ఎన్ని అపాయములు సంభవించినను దేవుని చిత్తమును చేయుట విశ్వాసము. "అబ్రాహాము శోధించబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను" (హెబ్రీ 11:17). తనకు లేకలేక వృద్ధాప్యములో జన్మించిన ఇస్సాకును దేవునికి బలిగా అర్పించుట అబ్రహాముకు ఎంత అయిష్టమైన సంగతియో మనము ఊహించలేము. అయినను దేవుడాజ్ఞాపించిన దానిని అబ్రహాము చేసెను. దేవుని ఆజ్ఞలన్నియును మనము అర్థము చేసుకొనలేకపోవచ్చును. అయినను దేవుడాజ్ఞాపించుచున్నాడు. కనుక విశ్వాసమును బట్టి వాటికి లోబడుట మంచిది.

"విశ్వాసము నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది" (హెబ్రీ 11:1). మనము పరలోకమును చూడకపోయినను విశ్వాసము వలన అది నిజమని మనము నమ్మగలము. మనము చూడలేక పోవుచున్న అనేక అట్టి సంగతుల యథార్థతను విశ్వాసము వలన మనము గ్రహించుకొన వచ్చును. అవన్నియు ఉన్నవని దేవుడు చెప్పినందున విశ్వాసము వాటి యథార్థతను అంగీకరించును.

రక్షింపబడుటకు విశ్వాసము దేవునిపై ఆధారపడును గాని స్వనీతిపై కాదు. "మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు. ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే" (ఎఫెసీ 2:8,9).

రక్షింపబడుటకు క్రీస్తు ప్రభువని విశ్వాసము అంగీకరించును. "యేసు ప్రభువని నీనోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీహృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). రక్షించు విశ్వాసము విధేయత చూపించు విశ్వాసమైనది. క్రియలు లేని విశ్వాసము మృతమైనది (యాకోబు 2:26). దేవుని ఆజ్ఞలన్నిటికిని వినయముతో విధేయత చూపించు విశ్వాసమే రక్షించు విశ్వాసము.

విశ్వాసము అభివృద్ధిజెందునట్టిది. అబ్రాహాముకున్నట్టి విశ్వాసము నీకు లేనందున నీవు నిరుత్సాహపడనవసరము లేదు. దేవుని వాక్యమును నీదైనిక ఆత్మీయాహారముగా అంగీకరించి దానిని దినదినము ధ్యానించిన యెడల నీవు విశ్వాసములో దృఢముగా పెరుగగలవు. విశ్వాసము పాపము నుండి, శోధనల నుండి నిన్ను కాపాడును. అందుకే పౌలు, మీరు "విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్నిబాణము

లన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు" అని క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (ఎఫెసీ 6:16).

క్రీస్తే మన విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించువాడునై యున్నాడు (హెబ్రీ 12:2). పాపివైన నీవు రక్షింపబడవలెనంటే యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వాసించుము. నీపాపముల విషయమై మారుమనస్సు పొందుము. క్రీస్తునందున్న నీ విశ్వసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవును నీ విశ్వాసము వలన దేవుని కుమారుడవు కాగలవు (గలతీ 3:26).

## మంచి సమరయుడు
## (The Good Samaritan )

లూకా 10:25-37

**పరిచయము:**

లూకా ఒక్కడు మాత్రమే వ్రాసిన ఉపమానములలో మంచి సమరయుని గూర్చిన ఉపమానము ఒకటి. యేసు ప్రభువు సువార్త పరిచర్య నిమిత్తమై పంపిన 70మంది తిరిగి వచ్చిన తరువాత, ప్రేక్షకులలో ఒకడడిగిన ప్రశ్నకు జవాబుగా యేసు ఈ ఉపమానము చెప్పారు. ఆయన ఏయే పట్టణములకు వెళ్లబోవుచున్నారో ఆయా ప్రదేశములకు ముందుగా యేసు 70 మంది శిష్యులను పంపించారు (లూకా 10:1). ఈ శిష్యులు రోగులను బాగుచేసి దేవుని రాజ్యము సమీపముగా యున్నదని ఆయా పట్టణస్థులకు తెలియజేయాలి (లూకా 10:9).

రాబోవుచున్న రాజ్యము ప్రవచనముల సారాంశము (యెషయా 2; దానియేలు2; యోవేలు2; అపొ.కా. 2). యూదులు దానికొరకై ఆసక్తితో ఎదురు చూచుచుండిరి (యోహాను 6:14-15) గాని యేసు ఒక ఆత్మీయ రాజ్యము స్థాపించుటకు వచ్చెను (యోహాను 18:36,37). ఆయన పరమునకారోహణ డవుటకు ముందుగా కూడ అపొస్తలులు ఒక భూసంబంధ రాజ్యమును ఆయన స్థాపించునను కొనుచుండిరి. "కాబట్టి వారు కూడి వచ్చినపుడు-ప్రభువా ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా? అని ఆయనను అడుగగా ఆయన కాలములను, సమయములను తండ్రి తన స్వాధీన

మందుంచి కొనియున్నాడు, వాటిని తెలిసికొనుట మీ పనికాదు" అని ఉత్తర మిచ్చెను (అపొ.కా. 1:6–7).

ఆ డెబ్బది మంది శిష్యులు తిరిగివచ్చి "ప్రభువా, దయ్యములు కూడ నీనామమువలన మాకు లోబడుచున్న వని" చెప్పిరి (లూకా 10:17). ఆయన "దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని యేసు వారితో చెప్పెను" (లూకా 10:20). అంతమంది ఆయన యెదుట ఉన్నను యేసు తన శిష్యులవైపు తిరిగి వారితో మాటలాడెను (లూకా 10:23). అప్పుడు ధర్మశాస్త్రోపదేశకుడొకడు లేచి యేసును ఒక ప్రశ్న అడిగెను. (లూకా 10:25).

నూతన రాజ్యమును గూర్చిన అపోహలు అదిస్థాపించబడిన తరువాత కూడ శిష్యుల మధ్య యుండెను. అపొ. పేతురు కూడ కొంత సంశయము తోనే యూదులు కాని వారికి సువార్తను బోధించెను (అపొ.కా. 10:11 అధ్యా). ఏది ఎలాగయినా ధర్మశాస్త్రోపదేశకుడు అడిగిన ప్రశ్న మూలముగా యేసు మంచి సమరయుని గూర్చిన ఉపమానము చెప్పెను.

**ఉపమానము :**

"ఇదిగో ఒకప్పుడు ధర్మశాస్త్రోప దేశకుడు లేచి –బోధకుడా నిత్యజీవము నకు వారసుడనగుటకు నేనేమిచేయ వలెనని ఆయనను అడిగెను" (లూకా 10:25).

ఒకడు అడుగవలసిన అతి ప్రాముఖ్యమైన ప్రశ్నయిది ! ఈ ప్రశ్నను వేర్వేరు సందర్భాలలో వేర్వేరు వ్యక్తులు అడిగిరి. వేర్వేరు కారణాలను బట్టి అడిగిరి. పెంతెకోస్తునాడు బాప్తిస్మము పొందిన 3000 మంది సువార్తనుగాని, సంఘమును గాని వెదుకుట లేదు. పేతురు చెప్పిన ప్రసంగమును విని "సహోదరు లారా, మేమేమి చేతుమని?" వారడిరిగి (అపొ.కా. 2:37). తార్సు వాడైన సౌలు యేసునుగూర్చిన సత్యమును వెదుకుట లేదుగాని దమస్కు మార్గమందు ఆయన అగుపడగానే, "ప్రభువా నేనేమి చేయ వలెను?" అని అడిగెను (అపొ.కా. 9:6). వారి ప్రశ్నలకు జవాబు దొరుకగానే వారు క్రైస్తవులయ్యారు. ధనికుడైన యువకుడు. " బోధకుడా నిత్యజీవముకు వారసుడగుటకు నేనేమి చేయవలెను?" అని అడిగెను (లూకా 18:18). గాని దుఃఖముఖుడై తిరిగి వెళ్లెను. యేసు చెప్పిన మంచి సమరయుని ఉపమానము వినిన తరువాత ఆ ధర్మశాస్త్రోపదేశకుడు కూడ తన ప్రశ్నకు లభించిన దైవిక జవాబును ప్రతిఘటించినట్లుగుపడుచున్నది.

డెబ్బదిమంది శిష్యులు తమ పనిని

ముగించుకొని యేసునొద్దకురాగా, మీ పేరులు పరలోకమందు వ్రాయబడి యున్నవని సంతోషించుడి అని ఆయన చెప్పగా ఈ శాస్త్రోపదేశకుడు కొంచెము వ్యంగ్యముగానే యేసును ఆ ప్రశ్న అడిగాడు. నిత్యజీవమునకు వారసుడన గుటకు నేనేమి చేయవలెనని అడుగగా, యేమీ చేయనక్కరలేదు అని ఆయన చెప్పలేదు. పెంతెకొస్తునాడు యూదులు మేమేమి చేయాలి అని అడుగగా, యేమీ చేయనక్కలేదని వారికి చెప్పబడలేదు తార్సువాడైన సౌలు ప్రభువా నేనేమి చేతును? అని అడుగగా, యేమీ చేయనక్కర లేదని అతనికి చెప్పబడలేదు. ధనికుడైన యువకుడు, ఈధర్మశాస్త్రోపదేశకుడు యూదుల యుగములో జీవించిరి. వారు చేయవలసినది ఒకటి యున్నదని వారెరుగుదురు. రక్షణ షరతులపై ఆధారపడియున్నది (హెబ్రీ 5:9). వెలుగులో నడచుటపై ఆధారపడి యున్నది (1 యోహాను 1:7). ఒక విధంగా మన రక్షణను మనమే కొనసాగించు కొనవలసి యున్నది (ఫిలిప్పీ 2:12). అయినను మానవ మాత్రులమైన మనము పాపము వలన దేవుని కృప, దయలపై ఆధారపడవలసియున్నది. (ఎఫెసీ 2:8; తీతు 3:5). దేవుని కృప, దయలు మన విధేయత అనే షరతుపై ఆధారపడి యున్నవి.

యేసు ఆధర్మశాస్త్రోపదేశకునితో, "ధర్మశాస్త్రమందేమి వ్రాయబడి యున్నది? నీవేమి చదువుచున్నావని అతని నడిగెను (లూకా 10:20), అతడడిగిన ప్రశ్నకు సరియైన సమాధానము అవసరమని నేడు మనందరము ఎరిగినదే అతని అనుభవము వలన దానికి జవాబును అప్పటికే ఎరిగి యుండ వలసిన స్థాయిలో అతడున్నాడు. అందు వలన యేసు అడిగిన ప్రశ్నకు అతడు తప్పక జవాబిచ్చునట్లు ఆయన ప్రశ్నించారు. అతడు యూదుల ధర్మశాస్త్ర పండితుడు. అన్ని ప్రశ్నలకు జవాబును ఎరిగి యుండవలసిన వాడు.

అతడు తన ప్రశ్నకు తానే కరెక్టుగా జవాబిచ్చాడు. గాని దానిలో యున్న పరమసత్యమును తనకు అన్వయించుకొనలేకపోయాడు. "అతడు నీదేవుడైన ప్రభువును నీపూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింప వలెననియు వ్రాయబడి యున్నదని చెప్పెను. అందు కాయన నీవు సరిగా ఉత్తర మిచ్చితివి; అలాగు చేయుము అప్పుడు జీవించెదవని అతనితో చెప్పెను. అయితే తాను నీతిమంతుడైనట్టు కనబరచకొనగోరి,

అతడు -అవునుగాని నా పొరుగు వాడెవడని యేసు నడిగెను" (లూకా 10:27-29).

అన్నిటికంటె ముఖ్యముగా దేవుని ప్రేమించాలి, తదుపరి నీపొరుగు వానిని ప్రేమించాలి. యిది మానవ కోటి యొక్క విధి. యిది పాత నిబంధనలోను, క్రొత్త నిబంధనలోను కూడ వక్కాణించబడినది. "నీపూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీపూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునప్పుడును త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను. సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను (ద్వితీ 6:5-7).

"కీడుకు ప్రతికీడు చేయకూడదు. నీ ప్రజలమీద కోపముంచుకొనక నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెను, నేను యెహోవాను" (లేవి 19:18).

"అందు కాయన నీ పూర్ణ హృదయముతోను నీపూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెనను నదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిది యునైన ఆజ్ఞ నిన్నువలె నీ పొరుగు వాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్ర మంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవి" (మత్తయి 22: 37-40). దేవుని యెడల యున్న ప్రేమ యితరులను ప్రేమించుటకు దోహదపడును, "ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెను" (1 యోహాను 4:20 -21).

ధర్మశాస్త్రోపదేశకుడు, నా పొరుగువాడెవడు ? అని ప్రశ్నించిన పిదప యేసు మంచిసమరయుని ఉపమానము చెప్పెను. యిది నిజముగా క్రైస్తవ్యానికి మూలమై యున్నది. క్రైస్తవ జీవన విధానమంతయు ఒక్క దృశ్యము లోనే యేసు ఇక్కడ వివరించారు. దేవునితో నీవు కలిగి యున్న సంబంధము నుండి, నీ పొరుగు వానితో కలిగియున్న సంబంధముతో విడదీయజాలవు అనే సత్యాన్ని యేసు ఇక్కడ బోధించారు.

"అందుకు యేసు ఇట్లనెను. ఒక మనుష్యుడు యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లుచు దొంగల చేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని అతని కొట్టికొరప్రాణముతో విడిచిపోయిరి. అప్పుడొక యాజకుడు

ఆత్రోవను వెళ్లుట తటస్థించెను. అతడు అతని చూచి, అతని మీద జాలిపడి దగ్గరకు పోయి నూనెయు ద్రాక్షారసము ను పోసి అతని గాయములను కట్టి తన వాహనము మీద ఎక్కించి యొక పూట కూళ్లవాని యింటికి తీసికొని పోయి అతని పరామర్శించెను. మరునాడతడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్లవానికిచ్చి - ఇతని పరామర్శించుము. నీవింకేమైన ఖర్చు చేసిన యెడల నేను మరలవచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పి పోయెను" (లూకా 10:30-35).

ఒక మనుష్యుడు అను ఈమాటలో అతని వివరముల యేమీ లేవుగాని, అతడు యూదుడై యుండ వచ్చును. అతడొక సమరయుడు గాని, అన్యుడుగాని అయ్యుండిన యెడల నాడుండిన సాంఘిక పరిస్థితులను బట్టి ఈ ఉపమానము యొక్క ప్రభావము క్షీణించియుండును. ఏలయనగా యూదులు సమరయులతోను అన్యుల తోను సాంగత్యము చేసేవారు కారు. మరియు ఒక సమరయుడు తోటి సమరయునికి లేక అన్యునికి సహాయ పడుటకు సహజముగా ముందుకు వచ్చును గదా. ఈ ఉపమానములో గాయపరచబడిన వాడు యూదుడే, అయితే యూదులే ముందు అతని ఆదుకొనవలసినవారు.

యెరికో యెరూషలేముకు తూర్పున 16 మైళ్లదూరములో సముద్రమునకు 800 అడుగులు దిగువ యుండెను. అందు వలన నిజానికి ఒకడు యెరికోకు దిగివెళ్లవలసి వచ్చెను. బైబిలులో కొన్ని ప్రాంతములు దొంగలకు దోచుకొనువారికి ప్రసిద్ధి. యెరూషలేమునుండి యెరికోకుపోవు మార్గము కూడయిట్టిదే. ఈ మార్గములో పయనించు వారు తరుచు దొంగల బారినపడేవారు గనుక ఆమార్గము "రక్తమార్గమని" ప్రసిద్ధిగాంచినది.

యూదుల చరిత్ర కారుడగు జోసిఫస్ ఇట్లు చెప్పుచున్నాడు. యేసు ప్రభువు ఈ ఉపమానము చెప్పకముందు హేరోదు రాజు నలభైవేలమంది పని వారిని దేవాలయపు పనిలోనుండి తొలగించెను. వారిలో అనేకులు దారి దోపిడి దొంగలలా తయారయ్యిరి. యెరికోకు పోవు మార్గము తీవ్రమైన వంపులతోను, గుట్టలతోను నిండి యుండుటచే వారు దాగుకొని దోచుకొనుటకు గొప్ప అవకాశము కలిగియుండెను.

ఆదారిని పోవు యూదులు దొంగల చేతిలో చిక్కుకొని తమ భక్తి విశ్వాసములను వెల్లడించినను, దొంగల యొద్ద అదేమీ పనిచేయలేదు. వారు

కేవలము దోచుకొని సంపన్నులగుటకే ప్రయత్నించేవారు.

అతని డబ్బు, వస్త్రములు కోల్పోయి, కొట్టబడి కొరప్రాణముతో యున్నవాడు, ఏమంత ఘనుడుగా అగుపడడు. అత్యవసరముగా సహాయ మవసరయిన ఒక పొరుగు వాడతడు. సంగతియేమంటే, ఆ నిస్సహాయ స్థితిలో అతనిని మొదట కనుగొనిన వాడొక యాజకుడు. తరుచు ప్రయాణము చేసేవారు. ఆకాలములో యెరికోలో 12,000 మంది యాజకులు కాపుర ముండే వారు. అతడు బహుశ తన దేవుని దేవాలయములోనే విడిచి పెట్టేసాడు. తన తోటి యూదుడు శ్రమలో యుండగా చూస్తు వెళ్లిపోయాడే గాని అతని యెడల జాలిగొనలేదు. సమయాన్ని వెచ్చించలేదు.

గాయపరచ బడినవాడు యాజకుడు కూడా ఒకే దిశలో యెరూషలేము నుండి యెరికోకు పయనించుచుండిరి. ఆ ప్రయాణీకుడు యాజకునికంటె కొంచెము ముందుగా ఆమార్గమున వెళ్లెను. యాజకుడు కొరప్రాణముతో యున్నవానిని చూచినను, తాను కాదుగాని తన వెనుకవచ్చు వాడెవడైన అతనికి సహాయము చేయునేమోయని అనుకొనెను. "కావున మనుష్యులు మీకు ఏమిచేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది" (మత్తయి 7:12). యాజకుడు దీనిని ఎరిగియుండినను, తన త్రోవను పోయెను. ఇట్టి తత్వమును గూర్చి హెచ్చరించు అనేక లేఖన భాగములను మనము చూడ వచ్చును (మత్త 25:31–46; యాకోబు 2:15–17).

"మనుష్యులు మీకేలాగు చేయవలెనని మీరు కోరుదురో ఆలాగే మీరును వారికి చేయుడి" (లూకా 6:31).

"కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరియెడలను విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10).

"కాబట్టి మేలైనది చేయ నెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" (యాకోబు 4:17).

"ఈలోకపు జీవనోపాధి గలవాడై యుండి తన సహోదరునికి లేమి కలుగుట చూచియు అతని యెడల ఎంతమాత్రము కనికరము చూపని వాని యందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును ?" (1 యోహాను 3:17).

కొరప్రాణముతో యున్న ఆ

యాత్రికుని తదుపరి ఒక లేవీయుడు చూచెను. లేవీయుడు దేవాలయములో పరిచర్య చేయువాడు. అతడు ఆరాధనలో సహకరించువాడు, ధర్మశాస్త్రమును ఉపదేశించువాడే అయినను శ్రమలో యున్న వానికి సహాయము చేయుటకు బదులు, అతడును తప్పించుకొనిపోయెను. ఆయాజకుడు ఈలేవీయుడు కూడ తాముచెప్పే దానిని చేయలేదు!

గాయపరచబడి కొనప్రాణముతో యున్నవానిని సమరయుడొకడు చూచెను. అతడు ఆగి అతనికి సహాయపడెను. సమరయుడంటే యేమిటి? యూదులకు అతనికియున్న తేడా యేమిటి? ఉత్తర దేశమైన ఇశ్రాయేలు దేశమును క్రీస్తుపూర్వము 722 సంవత్సరములో అష్షూరు దేశము జయించెను. దానిలోని 20 వేలమంది యూదులను బహిష్కరించి, 20 వేలమంది అన్యులను దానిలోనికి ప్రవేశింపజేసెను. కొంతకాలానికి అందున్న యూదులు ఈ అన్యులతో వైవాహిక సంబంధములు నెలకొల్పుకొనిరి. ఈ సంకరి జాతి సంతానమే సమరయులు. బబులోను చెరలోనుండి యూదులు తిరిగి యెరూషలేము చేరుకొనిన తరువాత దేవాలయ నిర్మాణములో పనిచేయుటకు యెరుబ్బాబెలు సమరయులకు అనుమతిని య్యలేదు. సమరయులు గెరిజీము కొండపై దేవాలయమును నిర్మించుకొనిరి (యోహాను 4:4-20). వారు పంచకాండములను మాత్రమే గౌరవించుచు యూదామతమును కొంతమట్టుకు అనుసరించిరి. మత్తయి 10:5 లూకా 9:52-53; 17:16,18; యోహాను 8:48 చూడుము.

గాయపరచబడిన వాడు యూదుడై, సహజ శత్రువైనను సమరయుడు అతనిపై జాలిగొనెను. జాతిమత విద్వేషాలను బట్టి అతడు చలించలేదు గాని నిజముగా ఆపదలోయున్న తోటి మానవునికి అతడు సహాయపడెను. ఆ సమరయుడు తన్నుతానే కొంత అసౌకర్యమునకు గురిచేసుకొనెను. బహుశ కొంత అపాయస్థితిలో కూడ అతడుండెను. ఆయూదుని గాయములకు పరిచర్య చేసి, నిస్సహాయుడైన ఆ మనుష్యునికి అతడు సహాయపడెను. అతడు తన గాడిదను, నూనెను వినియోగించెను.

పూర్వీకులు గాయములకు దెబ్బలకు విరుగుడుగా నూనెను వినియోగించే వారు (యెషయా 1:6). ద్రాక్షారసము కూడ బాహ్య ఉపశమనము కొరకు వినియోగించేవారు.

గాయపరచబడిన వాని అత్యవసరములను చూచుటయే గాక ఆ సమరయుడు అతని భవిష్యత్ అవసరములకు కూడ తోడ్పడెను. అతడిచ్చిన రెండు దేనారములు

రెండు రోజుల జీతముతో సమానము (మత్తయి 20:2). పూట కూళ్లవాని యింటిలో అయితే దేనారములో 12వ భాగము రోజుకు ఖర్చయ్యేది. ఇంకో మాటలో ఆ సమరయుడు మూడు వారాల మట్టుకు సరిపడా సహాయము చేసెను. అదీ సరిపోకపోతే ఆపూట కూళ్ల యింటివాడు ఏమైనా ఖర్చుచేస్తే దానిని కూడ యిచ్చుటకు ఆ సమరయుడు హామీయిచ్చెను.

ఈ ఉపమానము ద్వారా యేసు తనను ప్రశ్నించిన ధర్మశాస్త్రోపదేశకుడు అది తనకే వర్తించునట్లు గ్రహించ గోరెను. ఉపమానముయొక్క లక్షణమే యిది. 2 సమూ 12:1-3 చూడుము.

"కాగా దొంగల చేతికి చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవడు పొరుగు వాడెయెనని నీకుతోచుచున్నదని యేసు అడుగగా అతడు అతనిమీద జాలిపడిన వాడే అనెను. అందుకు యేసు - నీవును వెళ్లి ఆలాగు చేయుమని అతనితో చెప్పెను" (లూకా 10:36-37).

ప్రభువుయొక్క విరోధులు ఆయనను మాటలతో పడగొట్టాలని తరుచు ప్రయత్నించే వారు గాని వారు వ్యర్థులైరి (మత్తయి 22:15-22). ప్రతి సందర్భములోను యేసువారి మాటల దాడిని త్రిప్పికొట్టెను. ఆయన దేవుని కుమారుడు (మత్త 22:46; లూకా 14:6).

**ముగింపు :**

ఆ యూదా ధర్మశాస్త్రోపదేశకుడు జవాబును గ్రహించెను. గాయపర చబడిన వాని పొరుగువాడెవడు? లేవీయుడా, యాజకుడా, సమరయుడా? అని అడుగగా అతడు సరిగానే జవాబిచ్చె ను. గాని ఆ జవాబులో సమరయుడు అనే మాటను మాత్రము అతడు వాడలేదు! అతనిమీద జాలిగొన్న వాడే యని అతడు జవాబిచ్చెను. ఈ ఉపమానమునుండి నేర్చుకొనదగిన అనేక పాఠములున్నాయి. అవి నేడు మనకును వర్తించును అవి :

జాతి కుల మత వివక్షత లేకుండా అవసరములో యున్నవాడే మన పొరుగువాడు. మన యిల్లు కాదుగాని మన ప్రేమయే పొరుగువానిని కల్పించును.

నాపొరుగువాడెవడు ? అనేది ప్రశ్నకాదు గాని, నేనెవరికి పొరుగు వానిగా యుండగలను అనే ముఖ్యమైన పాఠమును ఆధర్మశాస్త్రోపదేశకుడు కనుగొనలేక పోయెను.

కార్యాచరణలో యున్న పరిచర్య యే క్రీస్తు రాజ్యములో ప్రయోజనము. క్రైస్తవ్యము అంతా ఆరాధనకు వెళ్లుట, ప్రార్థనలు చేయుటయే కాదు. కొందరు వీటిని సంవత్సరముల తరబడి చేయుచు

యుండవచ్చును. గాని వారొక మృత సంఘము ! క్రైస్తవ్యము ఒక జీవన విధానము.

మత సంస్కారములు యితరుల యెడల జాలిచూపు స్థానములో యుండరాదని యాజకుడు, లేవీయుడు వలన నేర్చుకొనగలము. నిజమైన దయాదాక్షిణ్యములు ఒకని ప్రవర్తనలో దృశ్యమగునని సమరయుని ద్వారా నేర్చుకోగలము. క్రీస్తుని బాధ్యత ఈలోకం అంతా ఆవరించుకొని యున్నదని ఈ ఉపమానము మనకు తెలియజేయు చున్నది.

యూదా మతములో శత్రువుకు చెందిన జంతువును సయితము పరిరక్షించాలని చెప్పబడినది (నిర్గమ 23:4-5). ఈ ఉపమానములో యాజకుడు, లేవీయుడు జంతువుకు కాదు సరిగదా, ఆపదలో యున్నవానిని దొంగలచేతిలో చిక్కుకొని కొరప్రాణము తో యున్న మానవునికి తప్పక సహాయ పడి యుండవలసినది. ఈ ముగ్గురిలో నీవెవరితో పోల్చుకుంటావు? యజకుడా? లేవీయుడా ? మంచి సమరయుడా ?

- లూయిస్ రష్మోర్

## బైబిలును అర్థము చేసికొనుటకు పది సూత్రములు
## (Ten Simple Reasons to Understand the Bible)

- Charles Scott

(గత సంచిక తరువాయి)

తరువాత 12 పుస్తకములు యెహోషువ గ్రంథమునుండి ఎస్తేరు గ్రంథము తెలియజేయుచున్నవి. ఇశ్రాయేలీయులు యొర్దాను నదిని దాటునట్లు దానిలో ఆయన ఆరిన నేలను ఎట్లు కలుగజేసెనో యెహోషువ గ్రంథము తెలియజేయుచున్నది. తరువాత వాగ్దాన దేశములో వారు స్థిరపడిన విధానము కూడ అదితెలియ జేయు చున్నది. మోషేద్వారా ఇయ్యబడిన ధర్మశాస్త్రమునుండి కుడికిగాని ఎడమకు గాని తొలగ కూడదని దేవుడు మరి యొకసారి వారికి జ్ఞాపకము చేసెను (యెహోషువ 1:7-8). అయితే ఈ 12 గ్రంథములను చదువుట ద్వారా వారు నైతికంగాను, ఆత్మీయకంగాను దేవుని నుండి ఎట్లు తొలగిపోయారోమనకు తెలియనగును.

**3. పద్యకావ్య గ్రంథములు – దైవ ప్రేరిత 5 పద్యకావ్యములు :**

| | | |
|---|---|---|
| యోబు గ్రంథము, | - | శోధన బాధలలో దేవుని యందు నమ్మికను గూర్చి చెప్పును. |
| క్రీర్తనల గ్రంథము | - | దేవుని యందలి విశ్వాసమును, ఆయనను స్తుతించుటను గూర్చి చెప్పును. |
| సామెతలు గ్రంథము | - | అనుదిన జ్ఞానము కొరకైన వివేక వచనములు |
| ప్రసంగి గ్రంథము | - | ఈ లోకములోని ధనధాన్యములు, సంపత్తి సుఖభోగము లన్నిటికంటె దేవుని సేవించుట ఉత్తమమని చెప్పును. |
| పరమ గీతము | - | వైవాహిక జీవిత మధురాన్ని సంఘము యెడల క్రీస్తుకున్న ప్రేమతో పోల్చి చెప్పును. |

**4. ప్రవచన గ్రంథములు – ప్రవచనములతో కూడిన 17 గ్రంథములు :**

ప్రవక్తల యొక్క ఈ 17పుస్తకములు దేవుని ప్రజల చరిత్రను మనకు చెప్పును. వారు అవిధేయతతో యుండిన యెడల ఏమి జరుగునో ప్రవక్తలు పలికేవారు. అది అట్లే జరిగేది ! వారు క్రీస్తు యొక్క జనన మరణములను గూర్చి ఆయన సంఘమును గూర్చి కూడ ప్రవచించిరి.

క్రొత్త నిబంధనలో కూడ 4 విభాగము లున్నవి:

**1 క్రీస్తుచరిత్ర :** క్రీస్తు జీవితమును ఇద్దరు అపొస్తలులు, మత్తయి, యెహాను (యోహాను 14:26), మరియు దైవ ప్రేరిత లేఖకులు మార్కు, లూకా వ్రాసిరి (ఎఫెసీ 3:4–5). యేసు యొక్క జీవితంలోని గొప్ప సంఘటనలను ఇవి చెప్పుచున్నవి. సర్వ జనాంగములు గ్రహించుకొను రీతిగ ఈనాలుగు పుస్తకములు వివిధ దృక్కోణ ముల నుండి క్రీస్తు చరిత్రను తెలియ జెప్పుచున్నవి. మత్తయి మొదటి అధ్యాయము, లూకా 1,2 అధ్యాయములు యేసు కన్య మరియకు జన్మించిన విధానమును చెప్పును. సిలువ పై ఆయన మరణం సమాధి, పునరుత్థానములను గూర్చి ఈనాలుగు పుస్తకముల లోని ఆఖరి అధ్యాయములు తెలియ జెప్పును. యేసు చేసిన గొప్ప బోధలు ఇందులో యున్నవి. మనమాయనను వెంబడించు వారమైన యెడల ఆయన ఉపదేశములను సహృదయముతో పఠించాలి. అంగీకరించాలి.

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత

ఆయన శిష్యులు సర్వలోకముకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించాలనే గొప్ప ఆజ్ఞ యిచ్చెను (మత్తయి 28:19-20: మార్కు 16:15; లూకా 24:46-47). సువార్త వాక్యమును వినువారు విశ్వసించాలి. మారు మనస్సు బొంది బాప్తిస్మము పొందాలి. అపొస్తలుల కార్యముల గ్రంధము వారీ యాజ్ఞను పాటించినట్లు తెలియజేయును.

**2. సంఘచరిత్ర - ఒకే ఒక్క పుస్తకము**, ఆదిమ సంఘ చరిత్రను తెలియజేయును. అపొస్తలుల కార్యముల గ్రంథము కొందరు అపొస్తలుల యొక్కయు మిగతావారి యొక్కయు ఆదిమ సంఘారంభమును గూర్చిన కార్యములను తెలియజేయును. అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయము క్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను జ్ఞాపకము చేయును. 9-11 వచనములు క్రీస్తు పరమందున్న తండ్రి యొద్దకు ఆరోహణుడగుటను గూర్చి తెలియజేయును. రెండవ అధ్యాయములో అపొస్తలులు ప్రత్యేకముగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటను గూర్చి చదువ గలము. క్రీస్తు సంఘము ఆరంభమాయెను. ఆయనను సిలువవేయుడియని అరచిన మూడు వేల మంది ఆయన యందు విశ్వసించి, మారు మనస్సు పొంది, బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:36-41); క్రీస్తు వారిని తన సంఘముతో చేర్చు కొనెను (అపొ.కా. 2:41-47). మత్తయి 16:18).

అపొస్తలుల కార్యముల గ్రంథములోని మిగతా అధ్యాయములు క్రైస్తవుల యొక్క ఉత్సాహమును. సంఘాభివృద్ధిని తెలియజేయును. అనేకులు విగ్రహములను వీడి, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందిరి. (అపొ.కా. 8:35-38; 16:29-22:18:8).

**3. పత్రికలు : క్రైస్తవులకు వ్రాయబడిన 21 ఉత్తరములు**

ప్రజలు క్రైస్తవు లెట్లయ్యారో అపొస్తలులకార్యముల గ్రంథము తెలియజేయుచున్నది. తరువాత 21 పుస్తకములు క్రైస్తవులైన వారికి వ్రాయబడిన ఉత్తరములు. కొన్ని పత్రికలు ఆయా వ్యక్తులకు వ్రాయబడినవి. ఉదహరణకు పౌలు తిమోతికి, తీతుకు వ్రాసిన పత్రికలు . మిగతావి ఆయా ప్రాంతములలో యున్న సంఘములకు, వారిని హెచ్చరించుటకు, సరిదిద్దుటకు గద్దించుటకు వ్రాయబడినవి.

రోమా పత్రిక నుండి ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రిక వరకు యున్న 13 ఉత్తరములు పౌలుచే వ్రాయబడెను. హెబ్రీ పత్రిక కూడ

అతనే వ్రాసియుండవచ్చును. మిగతావి యాకోబు, పేతురు, యోహాను, యూదాలచే వ్రాయబడెను. అవన్నీ మొత్తం 21 పత్రికలుంటాయి.

క్రైస్తవులకు వ్రాయబడిన పత్రికలన్ని వ్యక్తిగత దైనందిన భక్తి జీవితమును గూర్చియు, నిస్వార్థమైన ప్రేమను గూర్చియు చెబుతాయి. సంఘము యొక్క నిర్మాణ పద్ధతి, ఆరాధన యెట్లుండవలెనో కూడ అవిచెబుతాయి. వివిధ డినామినేషన్ల వలెగాక సంఘము ఏకమై యుండాలనే దేవుని కోరిక కూడ వాటిలో వ్యక్తమవు తాది. అందువలన ఆదిమ సంఘము ఎట్లుండెనో మనము తెలిసికోవాలంటే, ఈ పత్రికలు తప్పక చదవాలి.

**4. ప్రవచనము : ఒకే పుస్తకం ప్రకటన గ్రంథము :** '

"త్వరలో సంభవింపబోవు సంగతులతో బయల్పాటును క్రీస్తు యోహానుకు తెలియపరచెను (ప్రకటన 1:1). ప్రకటన గ్రంథమంతయు ఎక్కువ గురుతులతోను, అలంకారరీతిగాను లిఖించబడెను. దానిలోని గురుతులకు పలు భావార్థాలు చెప్పుటగాక బైబిలు యొక్క బోధను మనం క్షుణ్ణంగా అర్థం చేసికొనిన యెడల, మనం ప్రకటన గ్రంథమునర్థము చేసికోగలము. అయితే ఎన్నిశోధనలు సంభవించినను దేవుడు తన సింహాసనముపైనున్నాడు. సత్యమే విజయం సాధించుననే గొప్ప సంగతిని మనము గ్రహించుకోగలము. దానిలోని ఆఖరి రెండు అధ్యాయములు క్రెస్తవుని పరలోక గృహాన్ని వర్ణిస్తాయి.

**7. బైబిలులోని ఏమాటనైనా గ్రహించుకో వాలంటే మూడు సంగతులు గమనించాలి :**

ఎవరు, ఎప్పుడు, ఎవరితోచెప్పారు? అనే సంగతులు తెలిసికోవాలి. ఎవరు చెప్పారు ? అనునది ఆలోచించాలి. నీవు చదువుచున్నది ఆత్మ ప్రేరితుని మాటా? లేక వేరొకడు చెబితే అది అక్కడ రికార్డు చేయబడిందా ? "మీరు చావనే చావరు" అనే సాతాను యొక్క అబద్ధాన్ని ఆదికాండము 3:4లో రికార్డు చేయబడింది. గనుక ఎవరు చెప్పారు ? అనే అంశము గమనించుట ప్రాముఖ్యము.

ఎవరితో చెప్పబడింది? అనే సంగతి కూడ ఆలోచించాలి. అది అందరికీ చెప్ప బడిందా? లేక ప్రత్యేకంగా కొందరికేనా? అను సంగతి తెలిసికోవాలి. సర్వసృష్టికి కొన్ని సంగతులు చెప్పబడాలని క్రీస్తు చెప్పారు. (మార్కు 16:15-16). దేవుని వాక్యాన్ని బయలుపరుస్తు స్థిరపరచుటకు గాను అపొస్తలులకే చెప్పబడిన మరికొన్నిమాటలు కూడ ఉన్నాయి. ఏమి చెప్పుదుము? ఏలాగు చెప్పుదుము? అనే సంగతులనే గూర్చి

అపొస్తలులు బాధపడనవసరం లేదు (మత్తయి 10: 19-20). మనమైతే దేవుని వాక్యాన్ని చదవాలి (2 తిమో 2:15).

అది క్రైస్తవుడు కాని వానికి, క్రైస్తవుడగుట యెట్లో చెప్పబడిందా ? లేదా క్రైస్తవుడైన వానికే చెప్పబడెనా? దీనిని కూడా తెలిసికోవాలి.

ఎప్పుడు చెప్పబడింది ? అనే సంగతిని కూడ ఆలోచించుకోవాలి. అదొక ఆజ్ఞా? లేక మామూలుగా చెప్పబడిన మాటా? అది క్రీస్తుకు ముందు యూదులకు చెప్పబడిందా ? లేదా క్రీస్తే తన శిష్యుల నాజ్ఞాపించెనా? అనేకులు పాతనిబంధన కాలపు యూదుల ఆరాధనను క్రొత్త నిబంధన ఆరాధనతో మిళితము చేసి పొరబడుతు యుంటారు.

క్రీస్తు చనిపోయిన తరువాత గాని క్రొత్త నిబంధన పద్ధతి అమలులోనికి రాలేదని గ్రహించుము. మరణ శాసనము వ్రాసిన వాడు మరణిస్తేనే అది చెల్లును గాని అతడు జీవించుచుండగా ఎప్పుడు చెల్లదు అని హెబ్రీ 9:16-17లో వ్రాయబడి యున్నది. యేసుప్రభువు క్రొత్త నిబంధనను బోధించుచున్నను, ఆయన పాతనిబంధన కాలములోనే జీవించుచుండెను. గనుక పశుబలుల నాజ్ఞాపించెను. (లూకా 5:14; లేవీ 14:4-10), యూదుల సబ్బాతును (లూకా 4:16). మరియు పస్కాను ఆచరించెను (మత్తయి 26:18).

**8. అలంకార రీతిగ చెప్పబడితేనే గాని ఆయా మాటలు, పదములు అక్షరార్థము గానే గ్రహించుకోవాలి :**

ఆయా పదములకున్న సహజ అర్థమును తెలిసికోవాలి. దాన్ని తెలిసి కొనుటకు ఒక నిఘంటువును వాడుకో వచ్చును. బైబిలులో ఆయా పదములు ఎట్లు వాడబడెనో తెలిసికోవాలి. ఉదా: బాప్తిస్మము. ఆదిమ గ్రీకులో యిది ముంచబడుట అను అర్థము కలిగి యున్నది. దాన్ని బైబిలు వాక్యములతో చూచి గ్రహించుకోగలము. మత్తయి 3:16; అపొ.కా. 8:36-38; రోమా 6:3-4 ను చదువుము.

రూపకాలంకారములను గ్రహించుకొనుము : అన్ని భాషలలోను రూపకాలంకారములు వాడబడును. తద్వారా సంభాషణ చిత్రీకరించినట్లుం డును. రూపకాలంకారము వాడబడి నప్పుడు దానిలోని మాటలను అక్షరార్థ ముగా గ్రహించుకోరాదు. కుయుక్తి పరుడైన హేరోదును గూర్చి చెబుతు యేసు, "మీరు వెళ్లి ఆనక్కతో ఈలాగు చెప్పుడి" యనెను (లూకా 13:32). హేరోదు నిజముగానక్కకాదు. అతడు నక్క వలె యుండెను. యోహాను

యేసును "దేవుని గొర్రెపిల్ల" యని వర్ణించెను. అయితే యేసు నాలుగు కాళ్లు గల నిజమైన గొర్రెపిల్ల యని దీని యర్థము కాదు. బలిగా అర్పింపబడుటకు తేబడిన గొర్రెపిల్లవలె ఆయన యుండెను. సిలువ మరణములో యేసుప్రభువు పాప ప్రాయశ్చిత్తార్థ బలియాయెను.

యేసు క్రీస్తు ప్రభురాత్రి భోజనమును ప్రతిష్ఠించుచు ఒక రొట్టెను పట్టుకొని తన శిష్యుల కిచ్చి - మీరు తీసికొని తినుడి: ఇది నా శరీరమని చెప్పెను (మత్త 26:26). ఆరొట్టె ఆయన మాంసము కాదు గాని అది ఆయన శరీరమునకు గురుతు అని మనం గ్రహించుకొంటాము (1 కొరింథీ 11: 24-27).

**9. ఏ వచనమునైనను సందర్భాను సారముగ గ్రహించుకొనుము :**

బైబిలులోని ఏవచనమైనను అది చెప్పబడిన సందర్భమును బట్టి గమనించుకోవాలి. దాన్ని తెలిసికోనుటకు దానికి ముందు. వెనకాయున్న వచనములను చదువుట మంచిది. మరియు ఆ అధ్యాయములో ఏ అంశాన్ని గూర్చి చెప్పబడిందో గమనించుము.

కొందరు బైబిలులోని మాటలను ఇక్కడ అక్కడా తీసికొని వాటిని సందర్భరహితముగా ఉపయోగిస్తారు. అది విచారకరం. సరిగదా బైబిలులో లేని సిద్ధాంతములను నిరూపించుటకు వారు వీటిని వినియోగిస్తారు. మత్తయి 27:5లో యూదాపోయి ఉరిపెట్టు కొనెను అని యున్నది. "నీవును వెళ్లి అలాగ చేయుమని" లూకా 10:37 లో యున్నది. "నీవు చేయుచున్నది. త్వరగా చేయుమని" యోహాను 13:27లో వ్రాయబడియున్నది. ఈలేఖనాలను బట్టి మనము పోయి ఉరిపోసుకోవాలా? కానేకాదు. అయితే పైనున్న వచనాలను సందర్భరహితముగా ఉపయోగిస్తే యేమి జరుగునో యిది తెలియజేయుచున్నది.

**సందర్భాన్ని గమనించునప్పుడు ఆచారములకుఆజ్ఞలకు గల వ్యత్యాసమును గమనించుము :**

కొన్ని సంగతులు ప్రత్యేకముగా ఆజ్ఞాపింపబడినవి. యేసు ఇట్లు చెప్పెను: "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు" (యోహా 14:21). క్రీస్తు అపొస్తలులకు ఆజ్ఞలనిచ్చెను (అపో.కా. 1:2; మత్తయి 28:19-20; అపో.కా. 10:48; 1 కొరింథీ 7:10-11). ఈ ఆజ్ఞలను వారెట్లు గైకొనిరో కూడ బైబిలు బోధించుచున్నది. మనం ఆజ్ఞలను, వారి ఉదాహరణలను అనుసరించాలి.

కొన్ని సంగతులు నాటి కాలపు ఆచారములైయుంటాయి. అయితే సాంఘికాచారములు ఆజ్ఞలు కానేరవు. దేవుని ఆజ్ఞకు విరోధముగా యున్న ఏ ఆచారమునైనను తిరస్కరించాలి (మత్తయి 15:8-9). దేవుని ఆజ్ఞకు విరోధముగా లేని సాంఘికాచారములను పాటించినను, పాటించకపోయినను ఫరవలేదు. కొన్ని సామాజిక ఆచారములు మర్యాదను చూపుటకు పాటించునట్టివి (1కొరింథీ 11:14- 16).

**10. ఏ అంశమైనను, బైబిలు అంతటిలో దాన్ని గూర్చి యేమి చెప్పబడినదో తెలిసికొనుము :**

ఒక అంశము పై బైబిలులో చెప్పబడిన దంతయు అంగీకరించుట యుక్తమగును. మనం సత్యాన్ని, సత్యాన్నే తప్ప మరి దేనిని కోరుకోకూడదు. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). గనుక దాన్నంతటిని మనం అంగీకరించాలి. యేసు "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటి నుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును" అని చెప్పెను. ప్రతి మాట అని ఆయన చెప్పెను. కొర్నేలిసరియైన స్వభావము కలిగియుండెను : అతడు పేతురుతో, "నీవు వచ్చినది మంచిది. ప్రభువు నీకు ఆజ్ఞాపించిన వన్నియు వినుటకై యిప్పుడు మేమందరము దేవుని యెదుట ఇక్కడ కూడి యున్నామని చెప్పెను" (అపో.కా. 10:33).

అనేకులు బైబిలు చదువకుండగానే వారి సొంత అభిప్రాయములను ఏర్పరచుకొందురు. సరిగదా వారి యభిప్రాయములకు అనుగుణంగా బైబిలును మల్చుటకు ప్రయత్నింతురు. ఒకడు రక్షింపబడాలంటే విశ్వసించాలని వారు ఒప్పుకొంటారు. అయితే విశ్వాసము మాత్రమే చాలునని వారు దానికి కలుపుతారు. మరియు విధేయత చూపు విశ్వాసము అవసరమని చెప్పు బైబిలు బోధను వారు నిరాకరిస్తారు (రోమా 1:5; 16:26; గలతీ 5:6; యాకోబు 2:19-24; హెబ్రీ 5:9: లూకా 6:46). మనము రక్షింపబడాలంటే కొన్ని బైబిలు షరతులకు లోబడాలి. విశ్వాసమువలన మాత్రమే కాదు. మార్కు 16:16; అపో.కా. 2:38; 11:18-22; రోమా 10:9,10; 1 పేతురు 3:21 చదువండి. ఏఅంశమును గూర్చియైనను బైబిలు చెప్పునదంతయు అంగీకరించాలి.

బైబిలులోని ప్రాధమిక సంగతులను తెలిసికొని, దేవుని కోరుర్రీతిగ జీవించుటకు మొదలు పెట్టి దేవుడు బైబిలులో చెప్పిన సంగతులను గూర్చిన

జ్ఞానమును మనం దినదినము అభివృద్ధి పరచుకోవాలి. తన గ్రంథములో దేవుడు అన్నిటినీ మనకు బయలుపరచలేదు. "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును" (ద్వితీ 29:29). అయితే ఆయన బయలుపరచిన సంగతులను చదివి ధ్యానించుట వలన ఆశీర్వదించ బడుదుము.

కొందరు నిరుపయోగమైన బైబిలు అంశములపై తమ సమయాన్ని వెచ్చిస్తారు. అందరికంటె పొడవైన వాడెవడు? అందరికంటె బలవంతుడెవడు ? ఎక్కువ కాలము బ్రతికిన వాడెవడు ? మొదలగునవి. మరికొందరు ఒకటి రెండు అంశములను తెలిసికొని అంతటితో ఆగిపోతారు. అయితే మనము యేసు క్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధిపొందాలి' (1 పేతురు 3:18).

మనలో యున్న దురభిమాన ద్వేషమును విడనాడి సత్యమును గ్రహింతము దేవుని వాక్యమందలి జ్ఞానంలో మనము పెరుగుచుండగా యిదివరకు మనము ఏర్పరచుకొనిన భావములు తప్పు అని గ్రహించగానే, వాటిని విసర్జించాలి. సత్యాన్ని చేపట్టాలి. అప్పుడుదేవుడు సంతోషిస్తాడు !!

(సమాప్తం)

- చార్ల్స్ స్కాట్

www.satyavanicoc.com వెబ్‌సైట్‌లో మీరు పర్యవేక్షించవచ్చును.

## సత్యవాణి టి.వి కార్యక్రమములు :

ప్రతి ఆదివారం సాయం **6గం॥లకు శుభవార్త**

ప్రతి బుధవారం సాయం **6:30 గంటలకు రక్షణ**

ప్రతి గురువారం మధ్యాహ్నం **2:30 గం॥లకు రక్షణ** మరియు

ప్రతి శనివారం "ప్రేమసాక్షి" టి.వి. **(తిరుపతిలో)** :

ఉదయం **7:00 గం॥లకు** చూడండి.

ఈ సభలలో పాల్గొనిన సంఘస్తులందరికీ స్థానిక సంఘము మంచి భోజన ఏర్పాట్లు చేసి, ఆతిథ్యము యిచ్చిరి. సహో॥ యం.రాజేంద్రకుమార్ 1986వ సం॥రము నుండి పరిటాల, వెల్లంకి, కంచికచర్లలో ఉన్న క్రీస్తు సంఘాలలో సువార్త ప్రకటిస్తూ నందిగామ నియోజకవర్గ క్రీస్తు సంఘం సువార్తికుల సహవాస కూటంను ఏర్పాటుచేసి ఈ ప్రాంతములో స్థానిక సంఘాలు బలపడటానికి ఎంతగానో దోహదపడుతున్నారు. సహో॥ రిక్కీ గూటం గారిని ఈ మహాసభలలో దుశ్శాలువలతోనూ, పూలదండలు వేసి ఘనంగా సన్మానించిరి. బ్ర.యు.ఇశ్రాయేల్ (ఇంకొల్లు) గారి ముగింపు ప్రార్ధనతో సభలు ముగిసినవి.

12-4-14 శనివారం సామర్లకోట మండలం చంద్రపాలెంలో క్రీస్తు సంఘం గ్రామీణ సువార్తికులు సదస్సు జరిగెను. ఆయా గ్రామాలలో పనిచేయుచున్న అనేకమంది సువార్తికులు హాజరయ్యిరి. జొన్నలగరువులో పనిచేయుచున్న సోదరులు పి. రామారావు గారు అధ్యక్షత వహించిరి. యమ్. యేసుదాసు (కొత్తకందరాడ), ఎ. సత్యనారాయణ (కొమరంపాలెం) గార్లు ప్రార్ధనలు చేసిరి. సోదరులు జాషువాగూటం గారు చక్కటి వాక్యపరిచర్యచేయగా సోదరులందరు ముగ్ధులైరి. చంద్రపాలెం స్థానిక సంఘము వచ్చిన వారందరికీ మంచి విందుఏర్పాటుచేసిరి. అక్కడ సోదరులు ఐ.జయేశ్వరరావ్ గారు మంచిపనిచేయుచు సంఘమును సమర్ధవంతముగా నడిపించుచున్నారు.

ప్రకటన గ్రంధ ప్రసంగమాలిక మరల ముద్రించబడి ఇప్పుడు లభ్యమగుచున్నది. ఒక్కో పుస్తకం పోస్టేజీతో సహా రూ.60/-లు అగును.

క్రైస్తవ కీర్తనల పుస్తకము కూడ మరల ముద్రించబడి ఇప్పుడు లభ్యమగుచున్నది. ప్రతి స్థానిక సంఘము కనీసం 10 ప్రతులు కలిగియుండుట మంచిది. ఒక్కో కీర్తన పుస్తకము పోస్టేజీతో సహా రూ.50/-లు అగును. వలయువారు దిగువ చిరునామాకు డబ్బులు పంపి పొందవచ్చును.

**SATYA VANI**

**7-9-35, Samba Murty Street, Kakinada - 533 004.**

**Ph : 0884 ` 2363722**

## మీకొక గొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 20 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 120/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరినీ స్థాపించండి.

# SATYA VANI


# 7-9-35, Sambamurthy Street,

Kakinada - 533 004. Ph: 0884- 2363722



RNI Regd. No. 69973/98

Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:

**SATYA VAKKU**

P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004